మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- బాలానగర్, అల్లాపూర్ డివిజన్లలో పర్యటన

సిటీబ్యూరో,జనవరి 8(నమస్తే తెలంగాణ) : క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మేయర్ కూకట్‌పల్లి జోన్‌లోని బాలానగర్, అల్లాపూర్ వార్డుల్లోని పలు ప్రాంతాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలనడిగి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బాలానగర్ డివిజన్ వినాయకనగర్, రాజీవ్‌గాంధీనగర్‌ల్లో నాలాలు, జీహెచ్ఎంసీ పార్కును సందర్శించారు. వినాయకనగర్ నాలాలో క్రమం తప్పకుండా డీ-సిల్టింగ్ చేయాలని సూచించారు. ప్రమాదాలను నివారించేందుకు భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్లలో చిన్న చిన్న పనులను వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అపూర్వచౌహన్, బాలానగర్, అల్లాపూర్ కార్పొరేటర్లు ఆవుల రవీందర్‌రెడ్డి, సబిహా బేగం, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, రఘు ప్రసాద్, ఎస్ఈ కోటేశ్వర్ రావు, డిప్యూటీ కమిషనర్లు, ఏఎంహెచ్ఓలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలనడిగి సమస్యలు తెలుసుకుంటున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణను కలిసిన డీ.పోచంపల్లి బీఆర్ఎస్ నాయకులు

దుండిగల్,జనవరి 8 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు,సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు శంభీపూర్‌కృష్ణని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కౌన్సిలర్ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందు కెళ్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

'కష్టపడి చదివి.. ఉన్నత లక్ష్యాలు చేరుకోండి'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ పిలుపునిచ్చారు. ఓయూ సివిల్స్ అకాడమీలో ఉచిత సివిల్ సర్వీసెస్, పోటీ పరీక్షల కోచింగ్‌ను బుధవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ కుమార్‌తో పాటు, పోటీ పరీక్షల నిపుణులు ఎం.బాలలత, ప్రొఫెసర్ చింత గణేశ్ హారయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కఠినమైన అంశాలను సులభతరంగా అర్థం చేసుకునే స్మార్ట్‌వర్క్‌తో కూడిన అధ్యయనం విద్యార్థులను ప్రభుత్వాధికారులుగా చేస్తుందన్నారు. అకాడమీ డైరెక్టర్ ప్రొ. కొండా నాగేశ్వర్, కోఆర్డినేటర్ డాక్టర్ విజయకుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

సమస్యలను పరిశీలిస్తున్న చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదాబేగం రఫీ

జీడిమెట్ల, జనవరి 8 : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చింతల్ కార్పొరేటర్ రషీదాబేగం రఫీ అన్నారు. డివిజన్ పరిధిలోని రోడా మేస్త్రీ నగర్ బీలో స్థానిక నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈ శిరీష, ఏఈ నాగరాజు, జలమండలి మేనేజర్ ఝాన్సీ, ఎంటమాలజీ ఏఈ అరుణ్‌కుమార్, ఈఎఫ్ఏ అశోక్, సాయి, ఎస్ఎఫ్ఏ గోపాల్, జీవన్, బీఆర్ఎస్ నేతలు, స్థానిక నాయకులు షఫి, సర్వర్, యూసుఫ్, హనీజ్, వాహిద్, షబ్బీర్, నయూమ్, వాహబ్, సలీం, సిద్దిక్, ముజాహిద్, అజర్, ఏజాజ్, సాయికిరణ్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని ఎంఏలాంగ్వేజెస్ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుai ఆహ్వానిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫలితాలపై చాలెంజ్ వాల్యూయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.10 వేల చొప్పున చెల్లించి ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్షపత్రాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈనెల 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 16లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

బాలానగర్, జనవరి 8 : డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాలానగర్ సీఐ నర్సింహరాజు పేర్కొన్నారు. బుధవారం గౌతంనగర్‌లో బాడీ గ్యారేజ్ జిమ్‌లో బాలానగర్ పోలీసులు యువతకు డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేటి తరం యువత మత్తుకు బానిసై జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దైనందిన జీవితంలో సెల్‌ఫోన్ వినియోగం అధికమైందని, తద్వారా సెల్ లేనిదే ఏ పని చేయలేకపోతున్నారని అన్నారు. ప్రధానంగా విద్యావంతులే సైబర్ నేరాల ఉచ్చులో చిక్కుకుంటున్నారని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ నెంబర్ ఆధార్, పాన్ కార్డ్, బ్యాంక్ ఖాతాలు, పోరసరఫరాల వినియోగానికి లింక్ అయి ఉండడం వలన సైబర్ నేరగాళ్లు దానిని ఆసరాగా లేనిపోని ఆశలు చూపించి నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇటీవల మహిళలు, యువతను టార్గెట్ చేస్తూ సైబర్ నేరస్తులు పంజా విసురుతున్నారని అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఇంటర్‌నెట్‌ను పరిమితికి మంచి వాడకూడదని ఆయన యువతీ యువకులకు సూచించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో పతంగులు ఎగురవేసేందుకు యువత చైనా మాంజాను వాడవద్దన్నారు. చైనామాంజా ప్రమాదకరమని హెచ్చరించారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై యువతకు అవగాహన కల్పిస్తున్న బాలానగర్ సీఐ నర్సింహరాజు

వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 21 నుంచి, మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 24 నుంచి, ఎంబీఏ (ఈ వినింగ్) ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 25 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

మెడికవర్ దవాఖానలో అన్నవాహిక శస్త్ర చికిత్స

కొండాపూర్, జనవరి 8 : అన్నవాహిక కుచించుకుపోయి ప్రాణాపాయ స్థితికి చేరిన 13 ఏండ్ల కుర్రాడికి అత్యంత సంక్లిష్ట శస్త్రచికిత్సను మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ దవాఖాన వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. చికిత్సకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... సోమాలియాకు చెందిన 13 ఏండ్ల కుర్రాడు తన వయస్సు సరిపడా బరువు కంటే చాలా తక్కువగా ఉన్నాడు. కాగా బాలుడు లాలాజలం మింగేందుకు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో మెడికవర్ వైద్యులు అతడికి అన్ని వైద్య పరీక్షలు నిర్వహించారు. అన్నవాహిక కుచించుకుపోవడంతోపాటు ఇతర సమస్యలను గుర్తించారు. దవాఖాన సీనియర్ కన్సల్టెంట్, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ మధుమోహన్‌రెడ్డి నేతృత్వంలో రెట్రోస్టెర్నల్ విధానం ద్వారా పెద్దపేగు మార్పిడి, గొంతులో అన్నవాహిక సరిచేయడం, ఉదరం లోపల డిస్టల్ కోల్-గ్యాస్ట్రిక్ అనస్టోమోసిస్, కోలో -కోలిక్ అనస్టోమోసిస్ విధానాల ద్వారా శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి బాలుడి అన్నవాహికను సరిచేశారు.

ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉండి ఆహారం తీసుకుంటున్నట్లు డాక్టర్ మధుమోహన్‌రెడ్డి తెలిపారు.

రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడు, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్ష ఫీజును ఈనెల 25వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చన్నారు.

సరోజిని గార్డెన్‌లో రెవెన్యూ అధికారుల సర్వే

కుత్బుల్లాపూర్,జనవరి 8: జీడిమెట్ల డివిజన్ పరిధి సరోజినీగార్డెన్‌లో బహుళ అంతస్తుల నిర్మాణం కోసం ప్రైవేట్ వ్యక్తులు యూఎల్‌సీ ప్రభుత్వ భూమిని ఆక్రమించారని డిసెంబర్ 12న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి తాసీల్దార్ స్వామి, ఆర్ఐ విజయ్‌కుమార్, సర్వేయర్ జ్యోతి, మేడ్చల్ జిల్లా యూఎల్‌సీ డీఐ బాలరాజ్, సిబ్బంది ఆ ప్రాంతంలో సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 48లో 5,807 గజాల యూఎల్‌సీ ప్రభుత్వ భూమి ఉన్నది. ఇదే ప్రాంతంలో యూఎల్‌సీ స్థలం ఆసుకొని సరోజినిగార్డెన్‌లో ఇటీవల కొందరు బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టనున్నారు. దాంతో అధికారులు ప్రభుత్వ స్థలాన్ని పూర్తిగా సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేశాక బహుళ అంతస్తుల నిర్మాణం కొనసాగించాలని యజమానులను ఆదేశించడంతో పనులను నిలిపివేశారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం సరోజిని గార్డెన్‌లో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. హద్దులు గుర్తించి యూఎల్‌సీ స్థలానికి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సరోజినిగార్డెన్‌లో యూఎల్‌సీ భూమిని సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

కార్మికులకు అండగా ఉంటా..: రవిసింగ్

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 8 : కష్టాల్లో ఉన్న కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని బీఆర్ఎస్ కార్మిక విభాగ రాష్ట్ర నాయకుడు రవిసింగ్ అన్నారు. పటాన్‌చెరువు పారిశ్రామికవాడలోని మోనోతరిలం కంపెనీలో రాము అనే కార్మికుడు డ్రైవర్‌గా పనిచేసి మానేశాడు. అతడికి రెండు నెలల జీతం ఇవ్వకుండా కంపెనీ యజమాని హరిలాల్ ఇబ్బంది పెట్టాడు. బాధితుడు కార్మిక సంఘం నాయకుడిని ఆశ్రయించగా.. యజమానితో మాట్లాడి.. డ్రైవర్‌కు రావాల్సిన రూ.60 వేలు ఇప్పించాడు. ఈ సందర్భంగా రవిసింగ్ మాట్లాడుతూ.. పారిశ్రామికవాడలో కార్మికులకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ పాల్గొన్నారు.

బాధిత డ్రైవర్‌కు జీతం డబ్బులను అందజేస్తున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకుడు రవిసింగ్

మల్టీ జెన్ పార్కు పనుల్లో వేగం పెంచాలి

మియాపూర్, జనవరి 8: డివిజన్‌లోని మయూరినగర్ కాలనీలో మల్టీ జెన్ పార్కు సుందరీకరణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అన్ని వయస్సుల వారికి మల్టీ జెన్ పార్కు ఉపయోగపడుతుందన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కాలనీ అభివృద్ధికి పూర్తి తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ కేవీఎస్ఎన్ రాజు, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 8 : కేపీహెచ్‌బీ కాలనీ కల్చలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. బుధవారం కాలనీ 4వ ఫేజ్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలను అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు రాజేశ్ గౌడ్, సంజీవరావు, మైఖేల్, ప్రవీణ్‌కుమార్, సంధ్య, రేష్మ, మగ్ధం, నజీర్, దేవసహాయం, రవి, లక్ష్మీ, బాబురావు, శ్రీధర్‌చారి, రాజు, రామకృష్ణరెడ్డి, సుబ్బు, మనీ, ఆర్‌కే చౌదరి, కళ్యాణ్, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

అబాకస్ పోటీల్లో నేతాజీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

జీడిమెట్ల, జనవరి 8: హైదరాబాద్ జోనల్ లెవల్ అబాకస్, వేదిక్ మ్యాథ్స్ కాంపిటీషన్ 2024-25లో నేతాజీ హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచారు. ఇందిరమ్మకాలనీలోని హైటెక్ మోడల్ స్కూల్‌లో విశ్వనాథ్ ఎడ్యూటెక్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్ కాంపిటీషన్‌లో పాఠశాలకు చెందిన రెండో తరగతికి చెందిన సుమిత్‌కుమార్ స్టార్ జూనియర్ లెవల్ -3లో ప్రథమ స్థానం సాధించగా 3వ తరగతి విద్యార్థిని చార్విక్ 3వ స్థానం సాధించింది. సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. సికింద్రాబాద్, హైదరాబాద్ జోనల్ ఇన్‌చార్జులు రాజ్‌కుమార్, రాకేశ్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ చింతల మహేశ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ నందిని, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

యువకుడు ఆత్మహత్య

మాదాపూర్, జనవరి 8: ఆర్థిక పరిస్థితులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం .. మాదాపూర్ గుట్టలబేగంపేట్‌కు చెందిన నిమ్మ వంశీకృష్ణారెడ్డి(23) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం వెదుకుతున్నాడు. ఈనెల 7న ఉదయం 8:15 గంటలకు క్యాబ్ తీసుకొని బయటకువచ్చాడు. మరుసటి రోజు ఉదయం 9:30 గంటలకు మాదాపూర్‌లోని శ్రీ నిర్వాణ ఇన్ హోటల్‌లో రూమ్ నెంబర్ 202లో ఉన్న ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన చేరుకొని మృతదేహాన్ని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాదాపూర్, జనవరి 8: మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ దుర్గంచెరువులో ఈ నెల 8 న ఉదయం 7 గంటల సమయంలో లేక్ సిబ్బంది శ్రీశైలం దుర్గం చెరువు బోట్ హోల్డింగ్ పాయింట్ వద్ద విధులు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని మృత దేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. దీంతో డీఆర్ఎఫ్ సిబ్బంది మృతదేహాన్ని వెలికితీసి పరిశీలించారు. మృతుడు సుమారు 40 ఏండ్ల వయసు ఉంటుందని, నలుపు టీ షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు పేర్కొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు : సీఐ

దుండిగల్,జనవరి 8 : నిషేధిత చైనామాంజాను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సూరారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గాలిపటాలు ఎగురవేసేటప్పుడు చైనామాంజాను వాడటం ప్రమాదకరమని, నేరమని పేర్కొన్నారు. చైనామాంజాను ఎవరైనా విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇక నుంచి 'ఓమ్ని' కూకట్‌పల్లి మెట్రో స్టేషన్

- ప్రకటించిన మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీబీ రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 8 : కూకట్‌పల్లి మెట్రో రైల్వేస్టేషన్‌కు ఓమ్ని వైద్యశాల కూకట్‌పల్లి మెట్రో స్టేషన్‌గా నామకరణం చేసినట్లు మెట్రోరైల్ మేజేజింగ్ డైరెక్టర్ కేవీబీ రెడ్డి తెలిపారు. కూకట్‌పల్లి మెట్రోస్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎండీ కేవీబీ రెడ్డి, ఇన్‌కార్న్ సంస్థ, ఓమ్ని వైద్యశాల చైర్మన్ ఆర్‌బీఎస్ సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెట్రోరైల్‌లో ప్రయాణికుల కోసం రూ. 399 తో ఈసీజీ, చెస్ట్ ఎక్స్‌రే, సీబీపీ, ఆర్‌బీఎస్, డాక్టర్ కన్సల్టేషన్‌తో కూడిన హెల్త్ ప్యాకేజీని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మెట్రోరైల్ ప్రయాణికులతో పాటు మెట్రోలో పనిచేసే కార్మికుల కోసం ఓమ్ని వైద్యశాలలో ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. మెట్రో ప్రయాణికులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మెట్రోరైల్ సేవల్లో ఓమ్ని భాగమైందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మెట్రోరైల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధీర్, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళి, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ లోకేశ్, ఓమ్ని గ్రూప్ డైరెక్టర్ పూర్ణిమరెడ్డి, సీఈవో దుర్గేశ్, చీఫ్ ఫైనాన్సియన్ ఆఫీసర్ అంకిత్‌షా, సూపరింటెండెంట్ వారీస్, జీఎం శ్రీనివాస్, పీఆర్‌వో ఆసిఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

దుండిగల్,జనవరి 8 : భోజనం వడ్డించే విషయంలో భర్త తిట్టి చేయిచేసుకోవడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఇంట్లో నుండి వెళ్లి పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డీపోచంపల్లిలోని డబుల్‌బెడ్‌రూం ఇండ్ల సముదాయంలో నివాసముంటున్న శేషం ఎలమందయ్య,ఎస్తేరమ్మ(45) దంపతులు స్థానికంగా టీ స్టాల్ నడుపుతూ జీవిస్తున్నారు.ఈనెల 5న రాత్రి భోజనం వడ్డించడం లేదంటూ ఎలమందయ్య తన భార్య ఎస్తేరమ్మను దూషించడంతో పాటు చేయిచేసుకున్నాడు.దీంతో మనస్తాపానికి గురైన ఏస్తేరమ్మ రాత్రి 11 గంటల ప్రాంతంలో బయటకువెళ్లింది.కొంత సేపటికి గుర్తించిన కుటుంబసభ్యులు ఎస్తేరమ్మ ఆచూకీకోసం చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం దక్కలేదు. బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీసినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఎస్తేరమ్మ కుమారుడు బెన్ని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

- 8 గ్రాముల బంగారు గొలుసు స్వాధీనం

నిందితుడు సాయిరామ్

మూసాపేట, జనవరి 8: ఉద్యోగానికి వెళ్తున్న యువతి మెడలోని 8 గ్రాముల బంగారు గొలుసును అపహరించిన నిందితుడిని కూకట్‌పల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి బంగారు గొలుసుతోపాటు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం...

ఏపీలోని కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు గ్రామానికి చెందిన కొట్టి సాయిరామ్(28) నగరానికి నెల క్రితం వలస వచ్చి కేపీహెచ్‌బీ కాలనీ ఐశ్వర్య మెన్స్ హస్టల్‌లో ఉంటూ ప్రశాంత్‌నగర్‌లోని అదిత్యా ప్రెసిటెక్ కంపెనీలో సెక్యూరిటిగా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 3న బాలజీనగర్‌లోని ఓమ్ని ఆసుపత్రి ఎదుట పార్కు చేసిన స్ప్లెండర్ బైక్‌ను దొంగలించాడు. అదేవిధంగా సంగారెడ్డికి చెందిన కె. శ్వేత(24) కూకట్‌పల్లిలో వివేకానందనగర్‌లో ఎయిర్‌టెల్‌లో జాబ్ చేస్తుంది. 4న ఉదయం 9గంటల ప్రాంతంలో కూకట్‌పల్లిలో బస్ దిగి వివేకానందనగర్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నది. ఆమె మెడలోని బంగారు గొలుసును నిందితుడు తాను దొంగలించిన బైక్‌పై వేగంగా వచ్చి తెంపుకొని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

ఐదు బృందాలుగా ఏర్పడి పరిసర ప్రాంతాల్లోని 180 సీసీ కెమోరాలను పరిశీలించిన పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. బంగారు గొలుసును ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ. 40వేలకు కుదువ బెట్టినట్లు తెలిపారు. వెంటనే పోలీసులు ముత్తూట్ ఫైనాన్స్ వారికి నోటీసులు జారి చేసి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి నుంచి బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుడి పైగతంలో కృష్ణా జిల్లా ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో 3 బైక్, ట్రాక్టర్ టైర్ల దొంగతనాలు, ఎటువంటి పత్రాలు లేని వాహనంతో యాక్సిడెంట్ చేసిన కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 8 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి.(కేజీ-రూపాయల్లో..) టమాట 15, వంకాయ 23, బెండకాయ 45, పచ్చి మిర్చి 40, బజ్జి మిర్చి 23, కాకరకాయ 45, బీరకాయ 45, క